నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్,నెల్లిమర్ల

66వ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీలకు ఇప్పటికే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కోర్టులు, వేదికలు సిద్ధం చేశారు. గుంటూరు, కర్నూల్, కడప, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జట్లు ఆదివారం సాయంత్రానికే చేరుకున్నాయి. మిగిలిన జట్లు సోమవారం ఉదయానికి చేరుకోనున్నాయి. పోటీల నిర్వహణకు నాలుగు కోర్టులు సిద్ధం చేశారు. సోమవారం ఉదయం జిల్లా ప్రజాప్రతినిధులు పోటీలను ప్రారంభించనున్నారు.

కబడ్డీ పోటీలకు సిద్ధం చేసిన కోర్టులు

నేటి నుంచి శంబర జాతర

- నేడు తొలేళ్లు... రేపు సిరిమానోత్సవం
- 200 ఆర్‌టిసి బస్సులు
- 700 మంది పోలీసు బందోబస్తు
- దేవాదాయ శాఖ పటిష్ట ఏర్పాట్లు

ఘటాలను తిప్పుతున్న మహిళలు

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవతగా, భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరుగాయించిన శంబర పోలమాంబ అమ్మవారి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ జాతరలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అంపక ఉత్సవం జరగనుంది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఇఒ రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ దాలినాయుడు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలోని చదురుగుడి, వనం గుడి వద్ద కూడా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత మొట్టమొదటి గిరిజన జాతర కావడంతో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తమ శాఖ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ జాతర విజయవంతమయ్యాలా పటిష్ట చర్యలు చేపట్టారు. రెవెన్యూ శాఖ తరపున ఆర్‌డిఒ కె.హేమలత, పోలీసు శాఖ తరపున డిఎస్‌పి సుభాష్ జాతరకు సంబంధించిన అన్ని విషయాలపై ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేపట్టారు.

200 ఆర్‌టిసి బస్సులు

జాతర సందర్భంగా 700 మందితో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా క్యూలైన్లో సిసి కెమెరాలతో పాటు గ్రామంలోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. సిరిమాను సందర్భంగా డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించనున్నారు. ఆర్‌టిసి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 200 ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడపనుంది. రద్దీని బట్టి అవసరమైతే మరిన్ని సర్వీసులు పెంచనుంది.

14వేల లడ్డూ ప్రసాదాలు సిద్ధం

అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల కోసం లడ్డూ, పులిహార ప్రసాదాలను సిద్ధం చేసినట్లువిఒ రాధాకృష్ణ తెలిపారు. ఇందుకోసం 14వేల లడ్డు ప్రసాదాలను, పులిహార ప్యాకెట్లను సిద్ధం చేశామన్నారు. లడ్డు ధర రూ.15, పులిహోరా ధర పది రూపాయలుగా నిర్ణయించి ఆన్లైన్ టికెట్లు విధానం చేపట్టామన్నారు. నేరుగానే క్యూలైన్ల వద్ద ఆన్లైన్లో టికెట్లు విక్రయించే ఏర్పాట్లు చేస్తామన్నారు. 10, 50 రూపాయలు టికెట్లతో పాటు ఉచిత దర్శనం కూడా ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం నేరుగా పోలీసు వారు అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక వాహనాలు కూడా ఏర్పాటు చేశారని అన్నారు.

వేలంపాట బైండోవర్లపై సిఐ సమీక్ష

జాతర సందర్భంగా సిరిమాను తిప్పేందుకు వేలంపాట నిర్వహించి విధానంపై భిన్న స్వరాలు వెలుడడంపై ఆదివారం సాలూరు సిఐ ధనుంజయరావు క్యూలైన్లో వద్ద గ్రామస్తులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది కొత్త నిర్ణయాలు అన్న శీర్షికతో 'ప్రజాశక్తి'లో వార్త వెలువడిన విషయం విధితమే. సిరిమాను తిప్పేందుకు వేలం నిర్వహించడంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ దాలినాయుడు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని స్థానిక ఎంపిటిసి సభ్యులు టి.పోలినాయుడు ఆధ్వర్యంలోని కొంతమంది గ్రామస్తులు ఆక్షేపణ తెలిపారు. దీనిపై సిఐ ధనుంజయరావు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తీసుకున్న నిర్ణయం సరిగ్గా లేదని అభిప్రాయానికి వచ్చారు. పోలమాంబ అమ్మవారితో శంబర వెలుగులోకి వచ్చిందని, జాతరలో ఏ విధమైన పొరపాట్లు లేకుండా అంతా సహకరించాలని ఆయన అన్నారు. సిరిమాను తిప్పేందుకు 40మందిని మాత్రమే అనుమతిస్తామని, దీనికి సంబంధించి వెంటనే జాబితా సిద్ధం చేయాలని చైర్మన్‌కు సూచించారు. సిరిమాను సందర్భంగా ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరిగితే సంబంధిత వేలం పాటదారునిపై కఠిన చర్యలు చేపడతామని సిఐ హెచ్చరించారు.

ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డిసి సుజాత

జాతర ఏర్పాట్లు పరిశీలించిన డిసి

జాతర ఏర్పాట్లను మన్యం జిల్లా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత ఆదివారం శంబర గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. లడ్డూ ప్రసాదాలను, క్యూలైన్లను, టికెట్లు పంపిణీ విధానాలను ఇఒ రాధాకృష్ణను అడిగి ఆమె తెలుసుకున్నారు. అలాగే ఆన్లైన్ టికెట్ విధానాన్ని కూడా ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కెఎల్ శోభారాణి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాతపరీక్ష ప్రశాంతం

- 20,569 మంది అభ్యర్థులు హాజరు
- 43 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- సిసి కెమెరాలతో భద్రతను పర్యవేక్షించిన ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు జిల్లాలో నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎపిఎస్-ఎల్‌పిఆర్‌బి) ఆధ్వర్యంలో జిల్లాలోని 43 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం పటిష్టమైన భద్రతతో పరీక్ష నిర్వహించారు. ఎస్‌పి ఎం.దీపిక పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జెఎన్‌టియు జంక్షన్ వద్ద రెండు బస్సులను ఏర్పాటు చేసి, సుదూర ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులను ఉచితంగా జెఎన్‌టియు పరీక్షా కేంద్రానికి పంపించారు. ఈ ఉచిత బస్సు సర్వీసులను ఎస్‌పి ఎం.దీపిక జెండా ఊపి ప్రారంభించారు. జెఎన్‌టియు, సీతం, లెండి, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలను ఎస్‌పి సందర్శించారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లను పరిశీలించి, పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. అభ్యర్థులు తీసుకొచ్చిన మొబైల్ ఫోన్లు, మనీపర్సులు, ఎలక్ట్రానిక్ వాచీలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. రాతపరీక్ష ఉదయం 10గంటలకు ప్రారంభమై, మధ్యాహ్నం 1 గంటకు ముగిసింది. విజయనగరం, బొబ్బిలి, రాజాంలో మొత్తం 43 పరీక్షా కేంద్రాల్లో 21,626 మంది అభ్యర్థులు ప్రాథమిక రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 20,569 మంది హాజరయ్యారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద ప్రత్యేకంగా పోలీసు సిబ్బందితో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసి, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు మార్గ నిర్దేశం చేశారు. రాత పరీక్షల్లో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా పరీక్షా కేంద్రాలను 9 రూట్లుగా విభజించి, ఒక్కొక్క రూటును పర్యవేక్షించేందుకు డిఎస్‌పి, సిఐ స్థాయి అధికారులను ఎస్‌పి బాధ్యులుగా నియమించారు. పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

అభ్యర్థుల హాల్‌టిక్కెట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి దీపిక

ఈ రాతపరీక్ష నిర్వహణలో విజయనగరం, బొబ్బిలి డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, బి. మోహనరావు, డిటిసి డిఎస్‌పి ఆర్.వీరకుమార్, దిశ మహిళా పిఎస్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఇతర పోలీసు అధికారులు పాల్గొని, పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను పర్యవేక్షించారు.

బొబ్బిలి : బొబ్బిలిలో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో 9 కేంద్రాలు, కలవరాయి, కోమటిపల్లిలో నాలుగు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 13 కేంద్రాలలో 4228మంది పరీక్షలు రాయాల్సి ఉన్నప్పటికీ 4018 మంది హాజరయ్యారుక. సమయానికి ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అరకొర బస్సులతో అభ్యర్థులు అవస్థలు పడ్డారు.

కిటకిటలాడిన ఆర్‌టిసి కాంప్లెక్స్

విజయనగరం కోట : పోలీస్ కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షకు ఆదివారం జిల్లా నలుమూలల నుండి అభ్యర్థులతో ఆర్‌టిసి కాంప్లెక్సు కిటకిటలాడింది. పరీక్ష ముగించుకొని మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వచ్చిన అభ్యర్థులతో ఆర్‌టిసి కాంప్లెక్స్ రద్దీగా మారింది. అందుకు సరిపడా బస్సులు లేకపోవడంతో చాలాసేపు ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తింది.

పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు, హాల్‌టిక్కెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

మాజీ ఎంపిపి కుల బహిష్కరణ

రాజన్నదొర వద్ద మొరపెట్టుకున్న మాజీ ఎంపిపి కళావతి

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని రాబంద గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి కొర్రాయి కళావతి కుల బహిష్కరణకు గురయ్యారు. బాధితురాలు కళావతి ఈ అమానుషాన్ని ఆదివారం ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఎదుట వెల్లడించి కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన స్పందించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. రాబంద గ్రామంలో 30 వరకు దళిత కుటుంబాలున్నాయి. కళావతిని అదే తరగతికి చెందిన వ్యక్తి రెండో భార్యగా వివాహం చేసుకున్నాడు. ఆయన మొదటి భార్యకు బాబు, పాప ఉన్నారు. కళావతికి ఇద్దరు కుమార్తెలు కలిగారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన.. రెండో భార్య కళావతి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆయనకు, మొదటి భార్యకు, ఆమె సంబంధీకులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. అవి శ్రుతిమించి బాధితురాలు కళావతిని చుట్టుముట్టాయి. మొదటి భార్య, ఆమె కుటుంబీకులు కళావతి పట్ల కఠిన నిర్ణయం తీసుకున్నారు. దళిత నాయకులతో మాట్లాడి ఆమెను కులం నుంచి బహిష్కరించినట్లు ప్రకటించారు. ఆరు నెలల క్రితమే ఈ అమానవీయ ఉదంతం చోటుచేసుకుంది. దళితురాలైన ఆశా కార్యకర్తను కూడా వారు బెదిరించినా ఆమె మానవతా దృక్పథంతో కళావతి భర్తకు వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామంలోని ఇతర సామాజిక తరగతుల వారిని కూడా అడ్డుకోవాలని చూసినా వారు పట్టించుకోకుండా కళావతి కుటుంబానికి సాయపడుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న భర్తను దృష్టిలో ఉంచుకుని కళావతి కష్టాలను దిగమింగుకుంటూ వస్తున్నారు తప్ప ఎక్కడా ఫిర్యాదు చేయలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కళావతి ఆదివారం పొరుగు గ్రామమైన మీసాలపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై తాను మాట్లాడతానని ఆమెకు ధైర్యం చెప్పారు. కొంత ఆర్థిక సాయం అందించారు. మాజీ ఎంపిపి కుల బహిష్కరణ ఉదంతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని పలువురు ఖండిస్తున్నారు. ఈ అనాగరిక నిర్ణయంపై ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

చిరుధాన్యాలు.. ఆరోగ్య సిరులు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ● రాష్ట్ర స్థాయి మిల్లెట్ మహోత్సవం ప్రారంభం

మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం

చిరుధాన్యాలు ఎంతో ఆరోగ్యదాయకమని, వీటిని ప్రతిఒక్కరూ వినియోగించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ఆధ్వర్యంలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి మిల్లెట్ మహోత్సవం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో ఆదివారం ప్రారంభమైంది. చిరుధాన్యాలతో చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, వంటల ప్రదర్శన, విక్రయాలను 25 స్టాళ్ల ద్వారా ప్రారంభించారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేసే పద్ధతులను వివరించే పుస్తకాలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోలగట్ల మాట్లాడుతూ చిరుధాన్యాలను సిరిధాన్యాలుగా పేర్కొన్నారు. గతంతో పోలిస్తే మన ఆహార అలవాట్లలో మార్పు రావడం వల్ల చిరుధాన్యాల వాడకం క్రమంగా తగ్గిందన్నారు. దీనివల్ల మధుమేహం, రక్తపోటు లాంటి జీవనశైలి వ్యాధులు పెరిగిపోయాయని చెప్పారు. గతంలో మాదిరిగా చిరుధాన్యాలను అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే చిరుధాన్యాల ఆహారాన్ని అలవాటు చేయాలని సూచించారు.

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కోవిడ్ తరువాత ప్రజల దృక్పథంలో మార్పు వచ్చిందని, చిరుధాన్యాల వినియోగం కూడా పెరిగిందని చెప్పారు. జిల్లాలో చిరుధాన్యాల సాగును, మార్కెటింగ్ ప్రోత్సహించడానికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. చిరుధాన్యాల సాగు రైతులకు లాభసాటిగా ఉన్నప్పుడే, ఉత్పత్తి కూడా పెరుగుతుందని సూచించారు. మెరకముడిదాంలో మొక్కజొన్న ప్రాసెసింగ్ పరిశ్రమను ఏర్పాటు కానుందని చెప్పారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ పౌర సరఫరాల సంస్థ ద్వారా చిరుధాన్యాలను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందిస్తోందని చెప్పారు. మధ్యాహ్న భోజనలో భాగంగా రాగి అంబలిని పంపిణీ చేయాలని కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. అనంతరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ డి.ప్రవీణ్, ఎపిఎఫ్‌పిఎస్ సిఇఒ శ్రీహరిరెడ్డి, ఫ్లిప్‌కార్ట్ కార్పొరేట్ రిలేషన్స్ ఆఫీసర్ గిరిధర్ మాట్లాడారు.

కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, జిల్లా సమాఖ్య అధ్యక్షులు సిహెచ్ వెంకటలక్ష్మి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం స్థాపకులు కుమారస్వామి, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి త్రినాథస్వామి, ఉద్యానశాఖాధికారి జమదగ్ని, ఎడి జగన్నాథరావు, సీనియర్ సైంటిస్ట్ అనురాధ, ఎపిసిఎన్‌డి జిల్లా మేనేజర్ ఎం.ఆనందరావు, ఆకాంక్ష పాల్గొన్నారు.

కీచక హెచ్‌ఎం సస్పెన్షన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంతకవిటి మండలం అప్పలఅగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్రా అప్పలరాజును విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపుల అభియోగాలపై ఆయన్ను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను లైంగిక పరంగా వేధిస్తే విధుల నుంచి తొలగించడమే కాకుండా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. ఎపిఎన్‌జిఒ జిల్లా జెఎసి చైర్మన్ జె.మురళి, నాయకులు వై.ఆనంద్ కుమార్, ఎన్.నీలాద్రినాయుడు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ రవి యాదవ్, ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, కోశాధికారి బి కాశయ్య సమక్షంలో ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా మువ్వల గంగాప్రసాద్, ప్రధానకార్యదర్శిగా చంద్రశేఖర రాజుతోపాటు మరో ఏడుగురు సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విజయనగరం పట్టణ కార్యదర్శి గంగి రమేష్, కోశాధికారి జి.అప్పారావు, సహాయ కార్యదర్శి ఎం.మంగరాజు, పి.మురళీ ప్రసాద్ పాల్గొన్నారు.

మా బిడ్డను ఆదుకోరూ..

స్నేహితులతో ఆడుతూ పాడుతూ ఆనందంగా గడపాల్సిన వయసులో అనారోగ్యంతో ఆస్పత్రుల వెంట తిరుగుతూ సతమతమవుతున్నాడు ఆ యువకుడు. తల్లిదండ్రులు లేక ఆరోగ్యస్థితి సరిగా లేక అంధకారంలో జీవిస్తున్నాడు. రెండు కిడ్నీలు పనిచేయక వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక తీవ్రమైన ఇబ్బందితో బాధపడుతున్నాడు. కుమారుడి కష్టాన్ని చూసి చలించిపోతున్న తల్లిదండ్రులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

మండలంలోని జొన్నవలస గ్రామానికి చెందిన అట్టాడ రాము, లలిత దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్దకుమారుడు రవితేజ (20) సుమారు పదేళ్లుగా రెండు కిడ్నీలు పనిచేయక ఇబ్బంది పడుతున్నాడు. కొన్నేళ్లుగా విశాఖలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయాల్సి వస్తోంది. నెలకు ఆస్పత్రి, మందుల కోసం రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. గ్రామంలో చిన్న చిన్న కరెంటు పనులు చేసుకుని జీవనం సాగించే తండ్రి రాము.. కుమారుడికి వైద్యం చేయించుకోలేని పరిస్థితి. దీంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. విశాఖలోని ఆస్పత్రి వైద్యులు రెండు కిడ్నీల మార్పిడికి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. కానీ, వాటిని ఏ విధంగా సమకూర్చాలో తెలియని స్థితిలో తల్లిదండ్రులున్నారు. దాతలు ముందుకు వచ్చి తమ కుమారుడి వైద్యం కోసం సహకారం అందించాలని వేడుకొంటున్నారు. సాయం చేసే దాతలు 9110720515 నంబరును సంప్రదించాలని కోరారు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుమారుడు రవితేజతో తండ్రి రాము

అథ్లెటిక్స్‌లో పతకాల పంట

పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు, మేనేజర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 20, 21 తేదీలలో శ్రీకాకుళంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 17 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజయనగరం జిల్లా విద్యార్థులు 28 పతకాలు సాధించారు. అందులో 5 బంగారు, 15 రజత, 8 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్, మేనేజర్లను డిఇఒ లింగేశ్వరరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వి రమణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

వార్షిక రుణ ప్రణాళికలో.. 63 శాతం అమలు

ఈ ఏడాది రుణ వార్షిక ప్రణాళికలో ఇప్పటి వరకు 63 శాతం రుణాలు అందజేశామని లీడ్ బ్యాంకు మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యంగా ఖరీఫ్ పంట రుణాలు లక్ష్యానికి మించి అందజేశామని పేర్కొన్నారు. రబీ రుణాలు త్వరలో ముమ్మరం చేస్తామని చెప్పారు. 2022-23 వార్షిక రుణ ప్రణాళిక రూ.7509 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ. 4735 కోట్ల మేర రుణాలు ఇచ్చామని స్పష్టం చేశారు. ఈ వారం లీడ్ బ్యాంకు మేనేజర్ 'ప్రజాశక్తి'కి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- లక్ష్యానికి మించి ఖరీఫ్ రుణాలు
- చిరువ్యాపారాలు, చిన్నపరిశ్రమలకు విరివిగా కేటాయింపు
- 'ప్రజాశక్తి'తో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు ముఖాముఖి

వార్షిక ప్రణాళికలో ప్రాధాన్యత, ప్రాధాన్యతేతర రంగాలకు ఎంతెంత కేటాయించారు?.

రూ.7509 కోట్ల వార్షిక రుణ ప్రణాళికకు గాను ప్రాధాన్యతా రంగాలకు రూ.3639 కోట్లు, ప్రాధాన్యతేతర రంగాలకు రూ.3870 కోట్లు చొప్పున కేటాయించాం. జీవన ప్రమాణాల మెరుగు అంటే.. వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన ప్రాధాన్యత రంగాలగాను, ఈ పరిమితులు దాటిన వాటిని ప్రాధాన్యతేతర రంగాలుగా పరిగణిస్తాం.

వ్యవసాయ రంగానికి ఎంత మేర రుణాలు ఇచ్చారు?.

మన జిల్లాలో ఎప్పుడూ వ్యవసాయ రంగానికే అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ ఏడాది ఖరీఫ్ రూ.2016 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా, రూ. 2038 కోట్ల రుణాలు ఇచ్చాం. రబీ సీజన్‌లో రూ.1401 కోట్లు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించగా, రూ. 720 కోట్లు ఇచ్చాం. ఖరీఫ్, రబీ కలిపి రూ.3417 కోట్ల వార్షిక లక్ష్యానికి గాను రూ.2758 కోట్లు ఇచ్చాం. ఇవి కాకుండా వ్యవసాయ యాంత్రీకరణకు కూడా వందలాది కోట్లు రూపాయలు కేటాయించి విడుదల చేస్తున్నాం.

స్వయం ఉపాధికి నిధులు కేటాయించారా?

ఔను! స్వయం ఉపాధికి కూడా ఈ ఏడాది విరివిరిగా నిధులు కేటాయించాం. ముఖ్యంగా పిఎం సన్నిధి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 7201 మందికి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 6009 మందికి చిరు వ్యాపారాలకు రూ.10 వేల చొప్పున రుణాలు అందజేశాం. జగనన్న తోడు పథకం కింద పట్టణ ప్రాంతాల్లో మెప్మా ద్వారా 10,334 మందికి, డిఆర్‌డిఎ ద్వారా 7229 మందికి రూ.10 వేల చొప్పున విడుదల చేశాం.

చిన్న పరిశ్రమల స్థాపన, ఉన్నవాటికి ఆర్థిక సహకారం ఎలా ఉంది?



జిల్లా పరిశ్రమల శాఖ, ఖాదీ ఇండస్ట్రీ ద్వారా పిఎంఇజిపి, పిఎంఎఫ్‌ఎంఇ తదితర పథకాల ద్వారా చిన్నపరిశ్రమల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు ప్రోత్సాహం కోసం భారీ కేటాయింపులే ఉన్నాయి. పిఎంఇజిపి ద్వారా ఈ ఏడాది 303 మందికి చిన్న వ్యాపారాలు, చిన్న పరిశ్రమలకు రుణాలు మంజూరు చేయాలని సంకల్పించినప్పటికీ 138 మందికి అందించాం. పిఎంఎఫ్‌ఎంఇ ద్వారా 43 మందికి మంజూరు చేయాల్సి ఉండగా 24 మందికి మాత్రమే ఇచ్చాం. పథకాలపై అవగాహన లేకపోవడం, వచ్చిన దరఖాస్తుల్లో చాలా వరకు అనర్హులుగా ఉండడం ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విరివిగా రుణమేళాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

వృత్తిదారులకు ఏ విధమైన సహకారం అందుతోంది?.

వృత్తిదారులను ప్రోత్సహిస్తూ జిల్లా వ్యాప్తంగా సుమారు 3842 మందికి రూ.59 కోట్ల రుణాలు బ్యాంకులు అందజేశాయి. 240 మంది చేనేత కార్మికులకు రూ.50 వేల చొప్పున ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా 121 మందికి అందజేశాం. ఈ రంగంలో 50శాతం పూర్తి చేసింది మన జిల్లా మాత్రమే. మెరకముడిదాం మండలం బుదరాయవలస గ్రామానికి చెందిన ఇత్తడి బిందెలు తయారీ చేస్తున్న ఎనిమిది కుటుంబాల వారు రూ.3 లక్షల చొప్పున రుణాలు పొందారు. ఇలా చాలా రంగాల వృత్తిదారులకు సబ్సిడీపై రుణాలు అందుతున్నాయి.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

కార్యకర్తను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

నెల్లిమర్ల : మండలంలోని గరికిపేట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మహంతి సన్యాసిరావును ఆ గ్రామ మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యానారాయణ ఆధ్వర్యంలో ఆదివారం టిడిపి నాయకులు పరామర్శించారు. సన్యాసిరావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడన్న విషయాన్ని తెలుసుకుని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు లెంక అప్పలనాయుడు పరామర్శించారు. పార్టీ తనకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట టిడిపి నాయకులు చందక చిన్నంనాయుడు, రాజప్పన్న తదితరులున్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

భోగాపురం : మండలంలోని సుందరపేట సిహెచ్‌సిలో రోగులకు జనసేన నాయకులు లోకం మాధవి, మిరాకిల్స్ సాఫ్ట్వేర్ సంస్థ సిఈఓ లోకం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు, రొట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 43 యూనిట్ల రక్తాన్ని సేకరించి రక్తనిధికి అందజేశారు. మిరాకిల్ సిఇఒ లోకం ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి పీఠానికి విరాళం

భోగాపురం : పూసపాటి రేగ మండలం, చౌడువాడ గ్రామ పంచాయతీ పరిధిలో గల రోలుచప్పిడి గ్రామంలో అయ్యప్ప స్వామి పీఠం నిర్మాణానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారు రాజు రూ. 30వేలు విరాళం అందించారు. తన స్వగ్రామం పోలిపల్లిలో ఆదివారం నగదును చౌడువాడ గ్రామ మాజీ సర్పంచ్ పసుపులేటి శ్రీనివాసరావు, కొయ్య లక్ష్మణరావు ఇతర పెద్దల సమక్షంలో అందజేశారు.


నగదు అందిస్తున్న కర్రోతు బంగార్రాజు

పిల్లల భవిష్యత్తు నాశనం చేయొద్దు

వేపాడ : ఉచితాలకు అలవాడు పడి పిల్లల భవిష్యత్తు నాశనం చేయొద్దని మండల దళిత మహాసభ అధ్యక్షుడు కొమనాపల్లి రాము అన్నారు. ఆయన మండల కేంద్రంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న పథకాలకు అలవాటు పడి మనతోపాటు మన పిల్లల భవిష్యత్తు కూడా నాశనం చేసుకోవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు మనకు అందజేస్తున్న ఉచిత పథకాలు మనం కడుతున్న పన్నుల వల్ల వచ్చే ఆదాయమేనన్నారు. ప్రజలకు రూపాయి ఇచ్చి ప్రజా ప్రతినిధులు విలాసాలకు, వేతనాలకు వేలకోట్లు దోసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు ప్రలోభాలకు ఆశపడకుండా పరిపాలన దక్షత కలిగిన వ్యక్తికి మన విలువైన ఓటును వేసి ఎన్నుకోవాలని కోరారు.

వావిలపాడులో విద్యుత్తుదీపాలు ఏర్పాటు

వేపాడ : మండలంలోని వావిల పాడు గ్రామంతో పాటు సంజీవి మెట్ట కాలనీ, గిరిజన గ్రామమైన కలకొండలోను గత రెండు రోజులుగా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా సరపంచ్ బీల రాజేశ్వరి, వైసిపి నాయకులు బీల సతీష్ మాట్లాడుతూ ప్రత్యేక శ్రద్ధతో విద్యుత్ సౌకర్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇళ్లల్లో ఉండే విద్యుత్‌కు ఆటంకం లేకుండా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొనండి

శృంగవరపుకోట : సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో జనవరి 26న నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ కోరారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సూచించిన ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. రైతులు, కౌలు రైతుల రుణాలను రద్దు చేయాలని, విద్యుత్ బిల్లును వెనక్కి తీసుకొని మోటార్లకు మీటర్లు బిగించడం వెంటనే నిలుపుదల చేయాలని, సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. రైతులు, కౌలు రైతులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రసవత్తరంగా ఎడ్ల పరుగు పందేలు

విజేతలకు బహుమతులు అందిస్తున్న దాతలు

వేపాడ : మండలంలోని రాయుడుపేట గ్రామంలో శ్రీ బంగారమ్మ తల్లి గ్రామదేవత తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పందేలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలలో 15 ఎడ్ల బళ్ళు పాల్గొనగా బోనంగికి ఎందిన పైడిమాంబ, తుమ్మకాపల్లికి ఎందిన జై దర్శిని, ఎం.సింగవరం గ్రామానికి చెందిన జై వీర సత్యం ఎడ్ల బళ్లు వరుసుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. మొదటి బహుమతిని రూ. 12వేలు, రెండో బహుమతిగా రూ. 10వేలు, మూడో బహుమతిగా రూ. 8వేలు అందించారు. మొదటి బహుమతిని వీలుపర్తి సర్పంచ్ సేనాపతి లీల అప్పారావు, రెండో బహుమతికి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు, మూడవ బహుమతిని మాజీ వైస్ సర్పర్ కోటాన అర్జునరావు ఆర్థిక సాయంగా అందించారు. గెలిపొందిన ఎడ్ల బళ్ల విజేతలకు దాతలు బహుమతులు అందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

శృంగవరపు కోట : మండలంలోని లచ్చుంద్రపాలెం, కొత్త మరుపల్లి, మూలబొడ్డవర గ్రామాలలో ఆదివారం శ్రీ సత్యసాయి సేవాసమితి, స్వామి నామ కీర్తన సంఘ సభ్యులు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ద్వారా ప్రజలకు నిత్యం సేవలు అందుబాటులో ఉంటాయని జిల్లా సేవాదళ రమణ తెలిపారు. డాక్టర్ త్రినాధరావు, శ్రీరామ్మూర్తి, సూర్యనారాయణ, సత్యంనాయుడు, నాగలక్ష్మిల పర్యవేక్షణలో 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కాగా 350 మందికి చీరలను పంపిణీ చేశామని చెప్పారు.

జిల్లెల మాడమ్మ మందిరానికి భూమి పూజ

శృంగవరపు కోట : పట్టణంలోని దత్త సాయి మందిరం వద్ద ఈ నెల 26వ తేదీన ఉదయం జిల్లెల మాడమ్మ అమ్మవారి మందిరం నిర్మాణానికి గ్రామ పురోహితుడు, సాంస్కృతిక పండితులు విన్నకోట భాస్కర్ శర్మ చేతులు మీదుగా భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఎస్‌కోట బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గార్లపాటి సత్యసాయి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సాయం

జామి : మండలంలోని కుమరాం పంచాయితీకి చెందిన సారిపల్లి ఈశ్వరరావు తన రెండు కిడ్నీలు పాడై గత కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నాడు. డయాలసిస్ కోసం వేలకు వేలు ఖర్చవడంతో అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామ కార్యదర్శులుగా పని చేస్తున్న తోటి ఉద్యోగులంతా కలసి నేను సైతం అంటూ ముందుకొచ్చారు. వారి సొంత నిధులతో సుమారుగా రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. ఈ మొత్తాన్ని కుమరాం గ్రామ సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, ఎంపిటిసి కంది పద్మావతి చేతుల మీదుగా అందజేశారు. ఆర్థిక సాయం చేసిన వారిలో డెంకాడ మండలం పతివాడ, మండలంలోని జెడి వలస కార్యదర్శులు, తోటి ఉద్యోగులు ఉన్నారు.

ఆర్థిక సాయం చేస్తున్న ఉద్యోగులు

జానపదంలో రాణిస్తున్న తిరుపతి

ప్రజాశక్తి- మెరకముడిదాం

జాతీయ స్థాయి జానపద కళా రంగంలో మండలంలోని ఊటపల్లి గ్రామానికి చెందిన పొట్నూరు తిరుపతి రాణిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న అనేక జానపద కళా రంగ పోటీల్లో పాల్గొని అవార్డులు పొందడంతో ఇటు జిల్లాకు అటు స్వగ్రామానికి పేరు ప్రతిష్టలు గడిస్తున్నాడు.

ఊటపల్లికి చెందిన తిరుపతి ఒక సామాన్య దిగుమధ్య తరగతి కుటుంబానికి చెందినవాడు. తల్లి తండ్రులు పొట్నూరు రాము, సింహాచలం, పెదనాన్న అప్పలనాయుడు, మామయ్య రమణ బాబు, బుర్రకదా, దశావాతారం, పందిరి పాటలలో మంచి కళాకారులు. ఇంట్లోనే జానపదా కళాకారులను చిన్నప్పటి నుంచి చూసి ఆ పాటలపై మక్కువ పెంచుకున్నాడు. పాఠశాల స్థాయిలో వేదికలలో పాడుతున్న సమయంలో మాటివి రేలారే రేలా సూపర్ సింగర్ ఫేమ్ జానకిరామ్ పరిచయం అయ్యారు. అతను అనేక మంచి మంచి అవకాశాలు యివ్వటం దానికి తోడు ఊటపల్లి సర్పంచ్ సంఘం రెడ్డి లక్ష్మి ప్రోత్సాహం అందించటంతో జాతీయ స్థాయిలో జానపద ప్రోగ్రాంలో పాల్గొని అనేక బహుమతులు పొందాడు.

వారిద్దరి స్ఫూర్తితో

రేలారే రేలా జానకిరావు, మోహనరావులను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో వరసుగా మూడు సార్లు తన బృందంతో కలిసి ప్రథమ స్థానం సంపాదించుకున్నారు. 2016లో హర్యాన ప్రాంతంలో రోహతక్‌లో జరిగిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొని తన సత్తాను చాటారు. గతేడాది ఆగష్టులో ఎన్‌టివి, వనిత టివి చానల్స్‌లో ప్రముఖ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా ప్రచారమైన సారంగ దరియా అనే కార్యక్రమంలో పాల్గొని హుసారైన జానపద గీతాలతో ప్రముఖ సినీ గేయ రచయిత శ్యాం కాశర్ల, సినీ సంగీత దర్శకులు భీమ్స్, గాయని మధుప్రియల ప్రసంశలు పొందారు.

రేలారే రేలా జానకిరావు, మోహనరావు స్ఫూర్తితో ముందుకు..

గీతాలాపన చేస్తున్న తిరుపతి

అందరికీ రుణపడి ఉంటాం

విజయనగరం జిల్లా నుండి సారంగ దరియా షోలో నేను నా స్నేహితుడు బురిడి శివ పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉంది. మాకు సహకారం అందించిన కుటుంబ సభ్యులకు, డప్పు శ్రీనుకు, డప్పు రాజన్నకు, మెరక ముడిదాం మండల ప్రజలకు, జిల్లా ప్రజలకు రుణపడి ఉంటాను.

- పొట్నూరు తిరుపతి జానపద కళాకారుడు ఊటపల్లి

పాదయాత్ర అడ్డుకోవడం సిగ్గుచేటు : కిమిడి

గరివిడి : రాష్ట్ర ప్రజలకు రాజ్యాంగం ద్వారా వచ్చిన ప్రాథమిక హక్కులను చీకటి జీవోలు ద్వారా హరిస్తున్నన్నారని చీపురపల్లి నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను యువగళం ద్వారా గళం వినిపించేందుకు లోకేష్ పాదయాత్ర చేయడానికి అనుమతి ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. జీవో నెంబర్ 2430 ద్వారా పత్రికలు, ఛానల్, సోషల్ మీడియాను నియంత్రించారన్నారు. జీవో నెంబర్ 1 ద్వారా ప్రతిపక్షాల గొంతు నలుముతున్నారని అన్నారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు అణిచివేత జీవోలను తీసుకొస్తున్నారని ఆరోపించారు. లోకేష్ చేస్తున్న పాదయాత్రకు అనుమతులివ్వ కూడదనే ఉద్దేశంతోనే పోలీస్ అధికారులు, అనవసరమైన విషయాలను అడుగుతున్నారని అన్నారు. రాష్ట్రంలో వైసిపి నాయకులకు ఒక చట్టం, రాష్ట్ర ప్రజలకు మరో చట్టం అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి: మాజీ మంత్రి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు అన్నారు. మండలంలోని గరికిపేట, కొండగుంపాం, పూతికపేట, మొయిద, నారాయణపట్నం గ్రామాల్లో ఆదివారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పతివాడ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రోజురోజుకూ వైసిపి అరాచకాలు ఎక్కువైపోతున్నాయని సామాన్య, మధ్య తరగతికి చెందిన వారిని నానా అవస్థలకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. అనంతరం వీధుల్లో తిరుగుతూ వైసిపి వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యానారాయణ, టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు, గురాన అసిరినాయుడు, రాజప్పన్న, బెల్లాన అచ్చెంనాయుడు, బెల్లాన బంగారునాయుడు, శ్రీను, నాగభూషణరావు, పతివాడ గోవింద, పతివాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

అధికారుల అండగా కబ్జాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నల్లబెల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 164-3లో 91 ఎకరాల విస్తీర్ణం గల కృష్ణంరాజు చెరువును వావిలిపాడు గ్రామానికి చెందిన వైసిపి నీడ నేత కబ్జాకు పాల్పడుతున్నాడు. అతని జిరాయితీ భూమికి ఆనుకుని ఉన్న చెరువు గర్భాన్ని దర్జాగా ఆక్రమించుకున్నారు. ఈ విషయంపై ఇప్పటికే గ్రామ రెవెన్యూ అధికారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కబ్జాకు అధికారుల అండ కూడా ఉందని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. కబ్జాకు గురైన చెరువును పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఇప్పటికైనా తహశీల్దార్ స్పందించి ఆక్రమణల దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మట్టివేసి చెరువును కబ్జా చేసిన అక్రమార్కులు

నేడు సర్పంచుల సంఘం రౌండ్ టేబుల్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయవాడ కేంద్రంగా సోమవారం జరగనున్న సర్పంచుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పంచాయతి రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు. సర్పంచుల సంఘం, పంచాయతి రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ అఖిల పక్షం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీ లకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి, ఎంపిపిలు, జెడ్‌పి ఛైర్మన్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పార్టీలకతీతంగా ఈ రౌండ్ టేబుల్ నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచుల విధులు, అధికార సాధన, కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం ద్వారా పంపిన రూ.8,660 కోట్ల నిధులు తిరిగి సర్పంచుల ఎఫ్‌పిఎంఎస్ ఖాతాలో జమ చెయ్యాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలను సర్పంచ్ పరిధిలోకి తీసుకువచ్చి సర్పంచులు, ఎంపిటిసిలకు రూ.15వేలు, ఎంపిపి, జెడ్‌పిటిసిలకు రూ. 30వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పద్దతిలో గ్రామ పంచాయితీలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని గత మూడున్నరేళ్లగా గ్రామ పంచాయితీలకు ప్రభుత్వం నిలిపి వేసిన బకాయి నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా 12 డిమాండ్లతో ఈ సమావేశం నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన కోరారు.

గేదెల రాజారావు

నాడు-నేడు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని అమటాం రావివలస గ్రామ పంచాయతీ అమటాంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో రూ. 65లక్షలతో ప్రారంభ కానున్న నాడు నేడు పనులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ నిధులతో 5 అదనపు తరగతి గదులు నిర్మించనున్నారని చెప్పారు. ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి, మండల వైసిపి కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, పడాల భానుప్రకాశ్, వైస్ ఎం.పి.పి. రావాడ బాబు, సవరవల్లి సర్పంచ్ ఉప్పాడ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎంపిటిసి పట్న తాతయ్యలు, పడాల శ్రీను, దాట్ల శ్రీను రాజు , ఉప సర్పంచ్ నడుపూరి సత్య నారాయణ నాయుడు, పాఠశాల కమిటీ ఛైర్మన్లు, గాబు వెంకటరమణ, బండారు సూరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. త

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కంపు కొడుతున్న గ్రామాలు

- ఇబ్బందులు పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వంగర

ప్రశాంతతకు ఒకప్పుడు మారుపేరుగా పిలవబడే పల్లె గ్రామాలు పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో కంపుకొడుతున్నాయి. దుర్వాసన వెదజల్లి దోమలకు నిలయంగా మారుతున్నాయి. ప్రస్తుతం మండలంలో కొప్పర, ఓని అగ్రహారం, నీలయ్యవలస, అరసాడ, మడ్డువలస, తదితర గ్రామాలలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలంగా కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించకపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

కొప్పర గ్రామంలో శీలంకి వారి వీధిలో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. సచివాలయం పక్కనే ఉన్న రోడ్డు, ముందు రోడ్డు పై మురుగునీరు ప్రవహిస్తుండటంతో అటువైపు వెళ్లే వాహనదారులు కాలిబాటదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఓని అగ్రహారంలో ఎస్‌టి కాలనీ ముందు ఉన్న కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రధాన వీధి కాలువల్లో కూడా చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహించి దుర్వాసన వెదజల్లుతోంది. మడ్డువలస, నీలయ్యవలస, అరసాడ తదితర గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఇఒపిఆర్‌డిని వివరణ కోరగా సమాధానం చెప్పకుండా దాటవేశారు.

కొప్పర సచివాలయం పక్కనే ఉన్న రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఓని అగ్రహారం ఎస్‌టి కాలనీ కాలువలో ఉన్న మురుగునీరు

వైసిపి పట్టణ స్థాయి సమావేశం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పట్టణ స్థాయి పార్టీ సర్వ సభ్య సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆదివారం నిర్వహించారు. పట్టణ పరిధిలో గల ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులతో కలిసి పట్టణ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ ఛైర్మన్లు గోళగాన రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే తనయుడు యువ నాయకులు శంబంగి శ్రీకాంత్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, జేసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరావు, పట్టణంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు

పదవీ కాలం పెంపుపై హర్షం

బిసి కార్పొరేషన్ల ఛైర్మన్, డైరెక్టర్ల పదవీ కాలం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో బొబ్బిలి నియోజకవర్గంలో ఉన్న డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. పదవీ కాలం పెంచడంతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును బిసి కార్పోరేషన్ డైరెక్టర్ కింతలి గీతా శ్రీనివాసరావు, కోట పెదరాములు, తదితరులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాలే ప్రభుత్వం లక్ష్యం

ప్రజాశక్తి- మెంటాడ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఆదివారం మీసాలపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. నవ రత్నాలు పేరుతో విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న రైతు భరోసా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తమదన్నారు. అనంతరం నెఫ్రా నిధులతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, లెంక రత్నాకర్ నాయుడు, వైస్ ఎంపిపిలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, ఎంపిడిఓ పి. త్రివిక్రమ్, మండల తహశీల్దార్ ఆదిబాబు, గృహ నిర్మాణ శాఖ ఎఇ డేవిడ్ ప్రసన్న కుమార్, చింతలవలస సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ, మెంటాడ పిఎసిఎస్ అధ్యక్షుడు తాడ్డి రామచంద్రరావు, పార్టీ సీనియర్ నేతలు సిరిశెట్టి నారాయణ రావు, పాండ్రంకి సన్యాసి రావు, దంతులూరి వెంకట చిట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం

ప్రజాశక్తి -విజయనగరం

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎపిఎస్‌ఎఫ్ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిల్లా జగన్మోహనరావు.. ఫైబర్‌నెట్ ఆపరేటర్లకు సూచించారు. స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎపి ఫైబర్ కేబుల్ ఆపరేటర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ సచివాలయానికి ఫైబర్ లైన్ వేశామని, అక్కడ ఆప్టికల్ లైన్ ట్రాన్స్‌మీటర్లను అమర్చనున్నామని తెలిపారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు, ఆస్పత్రులకు, ఇళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇళ్లకు ఇంటర్నెట్ కనెక్షన్ నెలకు కనిష్టంగా రూ.190 నుంచి వివిధ ప్యాక్‌లలో అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలో ఎపి ఫైబర్ మాత్రమే టీవీ ఛానల్స్, ఇంటర్నెట్, టెలిఫోన్ సౌకర్యాలతో కూడిన ట్రిపుల్ ప్లే సర్వీసులను అత్యంత నాణ్యంగా అందిస్తోందని చెప్పారు. భవిష్యత్తులో 80 లక్షల ఇళ్లకు సర్వీసులు అందివ్వడానికి లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు. ఇందుకు కావాల్సిన సెట్‌టాప్ బాక్సులు, ఇతర పరికరాలను సంస్థ సమకూర్చుతోందన్నారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్లు నెట్‌వర్క్‌లో ఎదురవుతున్న బిల్లింగ్, సాంకేతిక సమస్యలు, నెట్‌వర్క్ విస్తరణకు కావాల్సిన పరికరాలు ఆవశ్యకతను ఇడి దృష్టికి తీసుకువెళ్లారు. కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించి, సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ మేనేజర్ పిల్లా సతీష్, టెక్నికల్ షణ్ముఖ్, ఎంటర్‌ప్రైజెస్ మేనేజర్ సాయి, బిల్లింగ్ మేనేజర్ రాంశ్రీనివాస్, ఫైబర్ ఇన్‌ఛార్జి జనార్దన్, చంద్రశేఖర్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పొగమంచు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

దట్టంగా కురిసిన పొగమంచు ఒక ప్రాణం తీసింది. మండలంలోని పేరాపురానికి చెందిన సీలవరపు సూరిబాబు (25) ఆదివారం ఉదయం హెచ్‌బిఎల్ పరిశ్రమలో పనిచేసేందుకు తన ద్విచక్ర వాహనంపై పేరాపురం నుండి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వెలుతుండగా ముందు వెళుతున్న నాటు బండిని ఢీకొని మృతి చెందాడు. పొగమంచు కారణంగా ముందున్న నాటు బండి కనబడకపోవడంతో వెనుక నుండి వెళ్లి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాటుబంటి కావడంతో లైట్లు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని చెబుతున్నారు.

తండ్రి తాగుతున్నాడని కుమార్తె ఆత్మహత్య

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని జికెఆర్‌పురం గ్రామానికి చెందిన ముద్దాడ శ్రవంతి(15) తన తండ్రి మద్యానికి బానిసవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. గతంలో తన తండ్రి, తల్లీకి గొడవకాడంతో తల్లి కుమారుడుని తీసుకుని కన్నవారింటికి వెళ్లిపోగా శ్రవంతి మాత్రం తండ్రి వద్దనే ఉండిపోయింది. అయినప్పటికీ తండ్రిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో ఈ నెల 18వ తేదీన తన ఇంట్లో చీమల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వెంటనే ఆమెను బాడంగి పిహెచ్‌సికి అక్కడి నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందింది. తల్లి ముద్దాడ పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉమా మహేశ్వరరావు కేసు నమోదు చేశారు.

శ్రవంతి (ఫైల్)

భారీగా మద్యం సీజ్

ప్రజాశక్తి- బొబ్బిలి

బెల్ట్ షాపునకు తరలిస్తున్న మద్యాన్ని ఎస్ఐ జ్ఞానప్రసాద్, పోలీస్ సిబ్బంది సీజ్ చేశారు. శనివారం రాత్రి 10గంటల సమయంలో ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఐటిఐ కాలనీ సమీపంలో దాడి చేసి ఆటోను తనిఖీ చేశారు. ఆటోలో 552 మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న మెట్టవలసకు చెందిన కెల్ల రాము, పువ్వల పైడిరాజును అరెస్టు చేశారు. బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు హెచ్చరించారు.

రాజ్ మహల్ కాలనీలో దొంగల బీభత్సం

బొబ్బిలి : బొబ్బిలి రాజ్ మహల్ కాలనీలో శనివారం అర్థరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీకి విఫలయత్నం చేశారు. కాలనీలో నివాసముంటున్న మరడాన మురళీకృష్ణ ఇంటిలో చోరీకి పాల్పడగా, మరో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నం చేశారు. నారాయణప్పవలస ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న మురళీకృష్ణ శనివారం విశాఖలో చదువుతున్న కుమారుడు వద్దకు ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. శనివారం అర్థరాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రెండున్నర కిలోల వెండి వస్తువులు, నాలుగున్నర తులాల బంగారు వస్తువులు, రూ.1.50లక్షల నగదును చోరీకి గురి చేసినట్లు బాధితుడు చెబుతున్నాడు. ఒక ఇంటిలో చోరీ చేసి మరో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించడంతో స్థానికులు ద్వారా తెలుసుకున్న ఆర్డిఒ పి.శేషశైలజ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో చోరీ జరిగిన ఇంటిని హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, రమణ పరిశీలించి క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. చోరీలో తక్కువ పోయినప్పటికీ ఎక్కువ పోయినట్లు బాధితులు చెబుతున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర దర్యాప్తు చేస్తామని పట్టణ సిఐ నాగేశ్వరరావు చెప్పారు.